# వరూధిని

## విరియాల లక్ష్మీపతిరావు

**వివాహం ఆవశ్యకం పలువురికి. వైవాహిక జీవితం సుఖప్రదం అవుతుందని ఆశించడానికి మాత్రం అవకాశం ఉండదు. జీవిత భాగస్వామిని ఎన్నికపై సమస్తమూ ఆధారపడి ఉంటుంది. అందుకు మార్గం ఏమిటో తెలియదు.**

**మిస్ చంచలా,**

ఉత్తరం మీ నాన్నగారికి వ్రాయకుండా మీకు వ్రాశానని మీరు ఆశ్చర్యపడవచ్చు. కాని, దీనితోబాటే మీ నాన్నగారికికూడా, ఇంత పెద్దది కాకపోయినా, ఒక ఉత్తరం పంపించబడింది. "నా కప్పుడే పెళ్లి చేసుకొనే ఉద్దేశ్యం లేదని తెలియబరచడానికి చింతిస్తున్నాను" అన్న వాక్యంతో అమ్మాయి నచ్చలేదేమోనన్న జిజ్ఞాసలో పడక, తృప్తిపడి, లేక అసంతృప్తిపడి ఊరుకుంటారనే అనుకుంటాను. పెళ్లి చూపులకు వచ్చిన అబ్బాయి దగ్గిరనుండి ఇలాంటి ఉత్తరం వస్తే అతనికి తమ అమ్మాయి చదువు చాల్లేదనో, ఆ అబ్బాయి తలిదండ్రులు వ్రాస్తే మిగతా విషయాలు అంత సుముఖంగా లేవనో, లేక మరెందుకనో—తండ్రి ఆలోచన.

కాని నాకు కావలసినదల్లా ఆచూడబడిన అమ్మాయి మనస్సులో చెలరేగే భావాలకు, ఆ భావాలు వేసే ప్రశ్నలకు ఒక రూపం కల్పించడం. ఆ రూపమే ఒక కావ్యాను. అపుడు నేను చిత్రకారుణ్ని. కుంచె పట్టుకొని నిలుచున్నాను. ఊహూఁ... లేదు. వెయ్యిబోయే బొమ్మ పరిపూర్ణ స్వరూపాన్ని మనస్సులో ఊహించుకొంటున్నాను. ఇదెలా సాధ్యం? అన్న ప్రశ్నే లేదు. లేక చిత్రాన్ని నా ముందుంచినదే మీరా? . . . . .

యువకులందరి లాగే చదువుకునే రోజుల్లోనే కాబోయే భార్యకు కావలసిన లక్షణాలన్నీ ఎంచుకుంటూ, ఊహా సుందరికోసం కలలు కంటూ, వివాహం అంటే ఒక విధమైన అభిప్రాయాన్ని ఏర్పరుచుకొన్నాను. మీలో కూడా ఇలాంటి అభిప్రాయాలుంటాయని అనుకుంటున్నాను. "జీవితంలో పుట్టుక, చావులమధ్య వివాహం ఒక్కటే అతి ముఖ్యమైన విషయం" అని ఒక పాశ్చాత్య రచయిత అభిప్రాయం. దీనికి నేను ఎక్కువగా విలువ ఇస్తాను.

దీన్నిబట్టే నేను నా అభిప్రాయాలను విస్తరంగా ఎందుకు వ్రాస్తున్నానో కొంచెమైనా మీకు అర్థమై ఉండాలి. "నాలో ఏ లోపం ఉందని వేనితనికి నచ్చలేదను కోవచ్చు?" అనే ప్రబలమైన ప్రశ్నను మీ వ్యక్తిత్వం, లేక మీ ఆకర్షణీయమైన రూపం మిమ్మల్ని అడుగుతుంది. దానికి సమాధానం చెప్పడానికి చేసే ప్రయత్నమే ఇది.

మీరు సిగ్గుపడకుండా ఉంటే —'సిగ్గెందుకట?!' అని మీరు ఆశ్చర్యపోతే నేనవేది ఏమీ లేదు. నేనుమిమ్మల్ని చూడ్డానికి వచ్చిననాటి దృశ్యాన్ని ఒకసారి జ్ఞాపకానికి తెస్తాను. అసలు, మొదట్లో మీ నాన్నగారు నన్ను మీ ఇంటికి రమ్మని ఆహ్వానించినప్పుడు, అమ్మాయి పేరు 'చంచల' అని చెప్పగానే, పేరులాగే మనిషి, మనిషిలాగే హృదయం, హృదయాన్నిబట్టే ప్రవర్తన ఉంటాయేమోననే భయానికి లోనయ్యాను. షేక్స్పియర్ "చంచలత్వానికి మారుపేరు స్త్రీ" అన్నాడు. స్త్రీకి మారుపేరు చంచలత్వమేమోనని నేననుకొన్నాను. స్త్రీని నిర్వచించడానికి పురుషుడెవరు? అందుచేత దానికి వివరణ మీరే ఇవ్వాలి.

ముందు అనుకున్నట్టుగా మిమ్మల్ని చూసిన తరవాత అనిపించలేదు. మీ మాటలలోను, అభిప్రాయాలలోను స్థిరత్వం కనిపించింది. ఒక విధమైన వ్యక్తిత్వం చూడగలిగాను. నాకు అలాంటి వ్యక్తులంటే ఇష్టమే. వ్యక్తిత్వాన్ని నేను గౌరవిస్తాను. అయితే పెళ్లి అయిన తరవాత భార్యా భర్తలలో ఎవరు తమ వ్యక్తిత్వానికి ఎక్కువ గౌరవం ఆపాదించుకొంటారో దాన్నిబట్టే ఆ సంసారంలో వాళ్లు పొందే సుఖాన్ని కొలవవచ్చు. . . .

ఆలోచనలు కొంచెం అమార్గంగా ఉన్నట్టున్నాయి. మీరు ఈపాటికే కాగితం తిప్పినా సంతకం ఎక్కడుందో చూడకపోతే వాస్తవాలకు వస్తున్నాను.

నేను మంచి ఉద్యోగంలో ఉన్నానన్న విషయం తప్ప మీ నాన్నగారికి నన్ను గురించి ఏం తెలుసును? మంచి ఉద్యోగంలో ఉంటే అమ్మాయి సుఖపడిపోతుందనే లెక్కా? కొంతమంది యువకుల్ని చూడగానే చెప్పివెయ్యవచ్చు: "ఎలాంటి భార్య వచ్చినా సరే, ఇతనితో సుఖపడ లేదనుమా!" అని. పోనీ కుర్రవాడు అందంగానే ఉన్నాడని ఆయన నన్ను ఎంచుకున్నారంటే మనిషి అందంగా ఉంటే మనస్సు అందంగా ఉంటుందని ఖాయమేనా? ఈ ఆలోచనలన్నీ మీకుగాని ఆయనకెందుకు?

మీరు బాగా పాడతారు, మీకంఠం శ్రావ్యమైనది. నాకు సంగీతమంటే అభిమానం. మీకు ఆటలంటే ఇష్టం. నేను క్రికెట్ ఆటగాణ్ని. మీరు అందంగానే ఉంటారు. నేను ఆకర్షణీయంగా ఉంటాను. 'అందంగానే' అని ఎందుకన్నానంటే మీరు మరీ అందంగాలేరని. చాలా అందంగా ఉండే స్త్రీలకు తాము అందంగా ఉన్నామనే గర్వం తప్ప వాళ్లలో వ్యక్తిత్వానికి చోటులేదు. అందం ఆకర్షణ. ఆకర్షణలను గురించి తరవాత వ్రాస్తాను. పువ్వులున్నాయి. పదివేలు. అన్నీ అందంగానే ఉన్నాయి. పదివేల తేనెటీగలున్నాయి. కాని ఒక్కొక్క తేనెటీగకు ఒక్కొక్క పువ్వుమీదనే ఆకర్షణ కలిగింది. దండుగా వచ్చి పువ్వుల మీద వాలాయి. కాని ప్రతి తేనెటీగ తాను అనుకున్న పూవుమీద వాలలేదు. వేయి పువ్వులలో తనకిష్టమైనవి సగమైనా ఉంటే తను ఎన్నుకున్నదానిపై వాలడానికి అవకాశం ఎక్కువ ఉండేది. అభిరుచులు అందంబట్టే కొంత, ఆకర్షణనుబట్టే కొంత ఆధారపడి ఉంటాయి.

పెళ్లిని గురించి మాట్లాడుతున్నాను గనక దరిదాపుల్లో పైవిధంగా జరిగిన మా స్నేహితుడి పెళ్లిని గురించి ప్రస్తావించడం ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. అతనికి తను చూసే అమ్మాయిలో 'క్వాలిఫికేషన్స్' ఎట్టే అక్కర్లేదు. 'క్వాలిఫికేషన్స్' ఏమీ లేకపోవడమే ఒక క్వాలిఫికేషన్ అంటాడతను. కాని కొద్దిగా ఆధునికుడు. ముక్కు రీటా హేవర్త్ ముక్కులా ఉంటే తన కిష్టంట. ఆ అమ్మాయికి రీటా హేవర్త్ ఎవరో తెలియాలా? అక్కర్లేదు బహుశా.

"వంటచెయ్యడం వచ్చునా?", "ఇండియా ప్రెసిడెంటెవరు?" లాంటి ఒకదానికీ మరొకదానికీ సంబంధం లేని ప్రశ్నలు వేశాడు. అతనికి ఆమె కళ్లలో ఏదో కనిపించిందట. ఎంతైనా "తా వలచింది రంభ!" సరే, పెళ్లి అయింది. పాపం ఆవిడ కుటుంబ నియంత్రణం అన్నముక్క ఎప్పుడూ విని ఎరగదు. ఇతను మొదటి రోజే ఒక నాలుగైదు ఏళ్లదాకా సంసారం ఎలా చెయ్యవలసిందీ మొదలైన కార్యక్రమము, దేశ పురోగమనము అంటూ మాట్లాడాడు. 'కాంట్రాసెప్టివ్', 'సేఫ్ పీరియడ్' మొదలైన పదాలు వాడేసరికి ఆ అమ్మాయి బెంబేలెత్తిపోయింది. "ఇవేమిటి?" అంది. "సాన్ సెన్స్!" అన్నాడతను. 'ప్రోగ్రాం సంసారం' ఏమిటనుకుంటుంది ఆ అమ్మాయి. చిలకాగోరింకలకన్నా ఎక్కువ తెలియదు.

ఇది ఇలా ఉంచి మరొక రకమైన మనుషుల్ని చూడండి. నేనేదో ఇంటర్వ్యూకు ఢిల్లీ వెడుతూంటే రైల్లో ఒక మిలిటరీ ఆఫీసర్‌తో పరిచయం అయింది. ఆయన ఆంధ్రదేశం వదిలేసి చాలాకాలం అయిందిట. ఆయన కోముద్దుల కూతురు. హైస్కూలు చదువంతా తెలుగులోనే నడిచింది. కాని, తరవాత మాత్రం సీనియర్ కేంబ్రిడ్జి వగైరాలు. ఈతలో మంచి నేర్పరిట. తమ సంగతులన్నీ చెప్పిన తరవాత ఆయన ఇలా అన్నాడు: "చూడండి, రావుగారూ! మా అమ్మాయిని ఏ యూరోపియన్‌కో, నార్త్ ఇండియన్‌కో ఇచ్చి పెళ్లి చేద్దామనుకుంటున్నాను." "రావుగారట!" అక్కడి కాయన సిన్హాయో, ద్వివేదీయో అయివట్టు! ఆయన పేరు హనుమంతరావు. వాళ్ల కంటోన్మెంట్‌లో మరోలా పిలుస్తారుట.

'అయితే ఇంతకూ ఆ అమ్మాయి మొగుణ్ని ఇంగ్లీషులో ప్రేమిస్తుందా? వాళ్లిద్దరూ ఇంగ్లీషులోనే సరసాలాడుకుంటారా?' అని అనుమానం వేసింది నాకు. వాళ్లమ్మాయి స్వయంవరం ఏదో పెద్ద స్విమ్మింగ్‌పూల్ దగ్గిరో, లేక బీచ్ ఒడ్డునో జరగవచ్చని కూడా అన్నారాయన. నాకు ఈత రాదు. నీళ్లంటేనే భయం. లేకపోతే ఆఅమ్మాయిని ఆంధ్ర సంస్కృతినుండి దూరమైపోకుండా కాపాడటానికి నేనూ ఒక రాజకుమారుడులా స్వయంవరానికి హాజరై ఉందును.



ఎందుచేతనో ఏ విధమైన వివాహాలు చూసినా అయోమయంగా ఉంది. పెళ్లి అయిన తరవాత సుఖపడటం, సుఖపడకపోవటం— పంటలు వర్షాల మీదనే ఆధార పడ్డట్టు— అదృష్టం మీదనే ఆధారపడితే ఎలా? స్టాటిస్టీషియన్‌లా రెండింటికీ 'అవకాశం' చెరిసగం అనేస్తే పెళ్లి చేసుకోవడానికి ధైర్యం ఎలా వస్తుంది? ఒక నాణెం పైకి విసిరి బొమ్మా, బొరుసా అని అడిగినట్టేనా ఇది కూడా! పెళ్లి అయిన తరవాత ప్రేమ క్రమంగా పుట్టుకు రావాలని కొందరు — కాదు, ప్రేమ లేనిదే పెళ్లేమిటని కొందరు—వాదిస్తారు. పెళ్లి చేసుకున్న తరవాత ప్రేమించడం మొదలు పెడదామనుకున్న నా స్నేహితు డెంత సుఖపడ్డాడో, ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్న మిలిటరీ ఆఫీసరుగారి అమ్మాయి కూడా అంతే సుఖపడి ఉంటుందని నా ఊహ.

ఇక నా విషయంలోకి వస్తున్నాను. నేను క్రికెట్ ఆటగాణ్ణి కనక ఆ రోజు ఎక్కువగా క్రికెట్‌మీదే మాట్లాడానేమో నాకు తెలియదు. "ఇటీవల క్రికెట్ టెస్ట్‌లో సోబర్స్ ఎన్ని పరుగులు చేశాడు?" మొదలైన చర్చలనుబట్టి నన్ను మీరు అంచనా వేసి ఉండవచ్చు. సోబర్స్‌ను గురించి డ్రంకర్డ్ (తాగినవాడు) లా మాట్లాడితే, డ్రంకర్డ్‌ను గురించి 'సోబర్'గా (తాగనివాడు) లా మాట్లాడనా? లేక సోబర్స్ గురించే సోబర్‌గానా? చాలు.

షేక్స్‌పియర్ వ్రాసిన 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' కథ వినే ఉంటారని తలుస్తాను. అందులో ఒకసారి పోర్షియా అవస్థ గమనించండి. పెళ్లి కుమారులు చాలా మంది వస్తారు. ఎవరూ నచ్చరు. వాళ్లలో ఒకతనిని గురించి ఆమె అన్న మాటలివి: "'ఇతడెవరో మంచి గుర్రపుస్వారీ చేసేవాడిలా కనిపిస్తున్నాడు. కాని, ఎక్కువగా తన గుర్రాన్ని గురించే మాట్లాడుకుంటాడేం? గుర్రానికి కాలి నాడం ఊడిపోతే తనే వేసుకోగలడట! ఇదొక గొప్ప గుణమా? నా అనుమానం ఇతని తల్లి ఎవడో చెప్పులు కుట్టేవాడితో సరాగమాడిందేమోనని!"

ఇంకొక పెళ్లికొడుకును గురించి ఇలా అంటుంది: "ఆతడు చొక్కా ఇటలీలో కొన్నాట్ట; పాంట్ ఫ్రాన్స్‌లోను, టోపీ జర్మనీలోను, నడవడి ప్రపంచం అంతటిలోను అరువు తెచ్చుకొని వచ్చాట్ట."

ఆ రోజు నాదుస్తుల్లో ముఖ్యంగా మీ రేది గమనించారు పోర్షియాలా? టైనాట్? కోటు? పాంట్, లేక సాక్స్? సాక్స్ ఎన్నికనుబట్టే మనిషిని గురించి చాలా చెప్పేస్తాను నేను. నా మటుకు నేను మాత్రం మీపాదాలవైపు ఎక్కువగా చూశాను. పాదాల గోళ్లు అందంగా ఉండేలా జాగ్రత్త పడేవాళ్లు భర్తలను కూడా జాగ్రత్తగా చూసుకొంటారని నా నమ్మకం. ఈ వాక్యంలో గర్భితంగా ఉపమానమేదేనా మీకు కనిపిస్తే మీరు ఆనందపడవచ్చునేమో కాని, నాస్నేహితులకు మాత్రం ఆనందదాయకం కాదు. ఎందుకంటారా? భర్తల్ని స్త్రీల కాలిగోళ్లతో సామ్యం చేస్తే పురుషులు ఊరుకొంటారా?

రోమియో జూలియట్లు అమర ప్రేమికులు కదా! వాళ్ల ప్రేమ ఎక్కడ మొదలైందో తెలుసా, మీకు? ఒక్క చూపుతో, మాటతోకాదు. ప్రేమతత్త్వంగురించి రోమియోకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. ప్రేమికులు ఒకళ్లనొకళ్లు కలుసుకొనడానికి వెళ్లేటప్పుడు స్కూలునుండి తిరిగివచ్చేసే పిల్లల్లా ఆనందంగా ఉంటారట; విడిపోయేటప్పుడు స్కూలుకు వెళ్లే పిల్లల్లా విషాదంగా ఉంటారట.

షేక్స్‌పియర్‌కు ఉన్న నైపుణ్యంలో వెయ్యోవంతు ఉన్నా నాఅభిప్రాయాలన్నింటినీ నాలుగు వాక్యాల్లో వ్రాసి వెయ్యగలిగి ఉందును.

"మీది మొదటి చూపులోనే ప్రేమ సిద్ధాంతమా?" అని మీ రడగవచ్చు. ఏమని చెప్పను? మొదటి చూపులోనే ప్రేమిస్తున్నామనుకొన్నది ప్రేమకాదనీ, అది ఒక విధమైన కామం అనీ, యువకరక్తంపరాయిరక్తంకోసం తీసే పరుగు అనీ, ఆపరుగు పడుచుదనం అనే అరబ్బీ గుర్రానిదనీ ఏవేవో ఊహిస్తూ ఉంటాను. అయితే ఆ గుర్రం మీద ప్రేమ స్వారీ చేస్తుందా, లేక ఆకర్షణ స్వారీ చేస్తుందా అన్నది ప్రశ్న. ఆకర్షణ లేనిదే ప్రపంచమేలేదు. నిజమే. అందుచేత శరీరాల ఏకత్వానికి కారణమైన ఈ ఆకర్షణ మనస్సుల ఏకత్వానికి కూడా కారణం అవుతుందనీ, ఇందువల్లనే గ్రహాలు గతి తప్పకుండా తిరుగుతాయనీ కొందరి అభిప్రాయం. ఇదీ కొంతవరకు నిజమే.

ఇంగ్లీషులో అయితే "ఐ లవ్ యూ", "విల్ యూ మేరీ మీ?" అని తేలిగ్గా అనెయ్యచ్చు. తెలుగులో "నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అనడం చాలా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. తెలుగులోనే ప్రేమించాలని ఏముంది? ఇంగ్లీషులో అడగకూడదా? ఎందు కడగకూడదు? ఏమో, ధైర్యంగా, బీచ్ ఒడ్డునేనాసరే, చాలామంది యువకులు "నిన్ను నేన ప్రేమిస్తున్నాను" అని అనగలరని నేననుకోను. యువతుల మాట? . . .

యువతుల మాట నన్నయగారి నడగండి. ఆయన చెప్పినట్లు "నా మనోరథంబు సఫలంబుగా మందగ మంజరీ మంజుల మకరంద పాన మత్త మధుకర గాన మనోహర స్థలంబులను. .....మంద పవనంబులు గల నందనాదివనంబుల యందును ..మహానంద కదంబంబులైన మందాకినీ తీర మణిమయ వేదికలయందును చంద్రికాసుందరంబులయిన సికతాతలంబులనుమరియు నిర్ఝర విహార స్థానంబుల ననవరత స రతకేళీ సౌఖ్యాంబుధి నోలలార్చు" మనే వనితామణు లేరీ?

పోనీ,నలునికి దమయంతికీ ఒకరిని గురించి మరొకరికి చెప్పి ప్రేమ ఉప్పొంగించిన హంసలాంటి హంస లేదీ? "నలు గుణములు దమయంతికి, నలునకు దమయంతి గుణగణంబులు" తెలపడానికి, వారి సంగమానికి కారణ దూత అయిన కలహంస ప్రభావం వల్లనే గదా! నలదమయంతు లిద్దరూ ఒండొరులను చూచుకొనకుండానే విరహం అనుభవించారు! విరహం అనుభవించేవారికి రాత్రులు చాలా దీర్ఘంగా కనిపిస్తాయట. అందుకే వా రిద్దరూ "విలసన్నవ నందనంబులన్ నలిన దళంబులన్...దళిరుల శయ్యలన్ సలిలధారల జందన చారు చర్చలన్" రాత్రులు గడపవలసి వచ్చింది. ఈ విధంగా విరహాన్ననుభవించే ప్రేమికు లేరీ?



మబ్బుల తెరపై ప్రకృతి చిత్రం

ఫోటో— భరద్వాజ (మద్రాసు-18)

ఉప్పు ఉప్పు డనిపిస్తూ ఉంటుంది: 'ఆహా! ప్రవరాఖ్యా! నువ్వెంత వెర్రివాడవయ్యా! వనిత తనంతదా వలచి వచ్చిన చులకన చేయుదువటయ్యా! ఓ పెద్దనార్యా! నా కొక వరూధినిని ప్రసాదించవయ్యా! నేను ప్రవరుణ్ణి కానయ్యా! నే నంత కఠిన హృదయుణ్ణి కాను...కాను.'

ఔనులే! ఒక కవి చెప్పినట్లు, కృష్ణరాయలు చేతులు రెండు జోడించి, "ఒక కమ్మని పద్యము చెప్పుమన్న నిర్నిరతి నిరాకరించితివి." నీవు "మనుప్రబంధము వ్రాయ దొడంగు నపుడు నీ నిరుపహతి స్థలంబు రవణీ ప్రియదూతిక లేభావ విను ఎరిగి మొనర్తురో" ఎవరికీ తెలియదు. ఒక్క వరూధినిని సృష్టించడానికే "సెలయేరులు కొండలనుండి జారిక్రుమ్మరు నటువంటి చోట,ఎలమావులు క్రోవులు అల్లిబిల్లిగా పరచిన కోవలో, గరుడ పచ్చల సౌధము చెంత—పీటికా పరిమళముల్ గుబులొ్కనెడు పట్టున..." మొదలైన అందాలు




# వరూధిని

కావలిసి వచ్చె; అది చాలక "కిన్నెర పలికించు చొక్క రమణీమణి అబ్బురపాటుతోడ ముంగుటలను ద్రోసి... అందియల్ మెరయగ లేచి, విలోకన ప్రభల్ తరగలు దేర నీ యెదురు దారుల నెల్లను పాలవెల్లివల్" వరప వలసివచ్చె. నా కోసం మరొక వరూధినిని సృష్టించడానికి ఇంకెన్ని కావాలో? నే నన్నీ సమకూర్చలేను సుమా! నేను చెయ్యగలిగినదల్లా నీ ప్రతిభను గొంతెత్తి పాడటమే!

అలా అంటే నిజంగా నేను గాయకుణ్ణా! ఏదో అలంకరం కోసం తాపత్రయపడ్డా నంతే. ఇంతకూ మీకు అలంకారాలంటే ఇష్టమేనా? అలంకారాలు ఇష్టం లేని స్త్రీ ఎక్కడుంటుందిలెండి! అలంకారాలు లేని స్త్రీ పాటలు లేని తెలుగు సినిమా లాంటిది. పాటలు లేని తెలుగు సినిమాలు లేవు కనక (పాటలు ఆ సినిమాకు నప్పినా నప్పక పోయినా) అలంకారాలు లేని స్త్రీలుండరని భావము. ఉపమానం పేలవంగా ఉందా? అయితే, అలంకారాలు లేని స్త్రీని శైలి లేకుండా నూటు వేసు కొన్న పురుషునితో పోలుస్తాను. సరేనా?

గాయకుని మీద చమత్కరించబోయి స్త్రీల నలంకరించడంలోకి దిగాను. ఇంతకూ ప్రశ్నేమిటి? నేను గాయకుణ్ణా, కాదా? అని. నేను పాటలు బాగా పాడతానని ఒంటిమీద తెలివి ఉండగా ఎప్పుడూ అనలేదు. అలాగని నేను గాయకుణ్ణి కానని స్థిరపరిచేసుకుంటున్నా ననుకోవద్దు. ఈ కాలంలో గాయకులు కాని యువకు లెవరు? అధమం బాత్ రూమ్‌లో!

"మీ ఉద్దేశ్యాలు ఊగుతున్నాయి. ఊళ్ళేలు తున్నాయి. కాస్త భూమి మీదికి దిగి వస్తారా?" అని మీరంటే అలాగే చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నాను. భూమిమీద కబుర్లు చెప్పాలంటే అట్టే లేవు. నాలాగే పెళ్ళిని గురించి తేల్చుకోలేక సందేహంలో పడిపోయి కొంతమంది యువకులు ముప్ఫయి ఏళ్ళదాకా బ్రహ్మచారులుగా ఉండిపోతున్నారంటే మీరు ఆశ్చర్యపోవద్దు.

"ఇలా చూడ్డానికి వెళ్ళిన ప్రతి అమ్మాయికీ ఇంత లేసి ఉత్తరాలు వ్రాస్తారా?" అంటే నేనేమీ చెప్పలేను. లేక "ఇలాంటి ఆలోచనలతో సతమతమైపోతూ ఉంటే మీ కీ జన్మలో పెళ్ళి కానేకాదు" అని మీరంటే మాత్రం ఒప్పుకోను. ఎందుచేతనంటే, నే నెప్పుడో హఠాత్తుగా మళ్ళీ మీకు తారసపడవచ్చు. ఈ ఉత్తరంతో మీరు నాకు బాగా పరిచయం అయిపోయినవారిలా కనిపిస్తున్నారు. అప్పుడు నేను మీ కళ్ళలో ఏదో విద్యుత్తు చూడవచ్చు. అదే అయస్కాంతంలా మారి నన్ను, నా హృదయాన్ని మీవైపు ఆకర్షించుకోవచ్చు. కాని ఇంకా, ఇప్పు డేదీ చెప్పలేను.

ఉత్తరం అంతా ఓపిగ్గా చదివి ఉంటే మీ కీ పాటికి నా మీద,నా వ్రాత మీద ఏదో ఒకటి వ్రాయాలనిపిస్తూ ఉండవచ్చు. మీ జవాబునుబట్టి నన్ను గురించి మీ రేమనుకుంటున్నారో తెలుసుకొని ఆనందిస్తాను. కవరు మీద నా ఎడ్రసు ఉన్నదని గమనించ ప్రార్థన.

ఇట్లు,
రాజశేఖరరావు. ★